క్లుప్తంగా

వైభవంగా గంగమ్మ జాతర



గంగమ్మ ఊరిగింపు

విజయపురం: కలియంబాకం గ్రామంలో గత రెండు రోజులుగా జరిగిన గంగమ్మ జాతర గురువారం ముగిసింది. ఉదయం అమ్మవారి ప్రతిమను పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని, మొక్కులు తీర్చుకొన్నారు. తమిళనాడు నుంచి వచ్చిన కళాకారుల నృత్యం అందరినీ ఆకట్టుకుంది.

నేడు వాహనాల వేలం

నగరి: వివిధ కేసుల్లో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో వారు పట్టుకున్న వాహనాలను శుక్రవారం బహిరంగ వేలం వేస్తున్నట్లు ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ మాధవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్, ఎస్‌ఈబీ నేరాల్లో పట్టుబడిన వాహనాలను శుక్రవారం ఉదయం 10.30 గంటలకు మున్సిపల్ పరిధి చింతలపట్టెడలోని తమ కార్యాలయం వద్ద వేలం వేస్తామన్నారు. ఆసక్తి గలవారు పాల్గొనవచ్చునని తెలిపారు.

విద్య వినయంతోనే సాధ్యం



కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే థామస్

గంగాధర నెల్లూరు: విద్య వినయంతోనే సాధ్యమవుతుందని గంగాధర నెల్లూరు శాసనసభ సభ్యులు డాక్టర్ థామస్ అన్నారు. గురువారం మండల పరిధిలోని నెల్లేపల్లెలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినీవిద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న కిట్లను ఆయన పంపిణీ చేశారు. ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధి కోసం ఎన్నో మౌలిక వసతులు కల్పిస్తున్నాయని వాటిని విద్యార్థినీవిద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాధికారి చంద్రశేఖర్, మండల ఎంఈఓలు ఆంజనేయులు శెట్టి, గుణశేఖర్‌రెడ్డి, సర్పంచ్ గంగయ్య, నెల్లేపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయిని సుబ్బరత్నమ్మ ఇంచార్జ్ హెచ్‌ఎం యుగంధరాచారి, సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నమోదు చేయాలి

పాలసముద్రం: మండలంలోని వీఓఏలు తమ రికార్డులను సక్రమంగా నమోదు చేయాలని ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్ తెలిపారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో సీఆర్‌పీ, సీసీఎఫ్, స్త్రీనిధి రికవరీ, గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంఘమిత్రలు ప్రతి గ్రూప్ వద్దకు వెళ్లి సభ్యురాలు తీసుకున్న రుణాలను కట్టించాలని తెలిపారు. డ్వాక్రా గ్రూపులకు, సిబ్బందికి రికార్డులు ఏవిధంగా రాయాలి, స్త్రీనిధి రికవరీ ఏ విధంగా చేయాలి, ఇంటి వద్ద పెరటి కోళ్లు, పెరటి తోటలు ఏవిధంగా పెంచాలనే అంశాలను వివరించారు. ప్రభుత్వం డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఉద్దేశంలో డ్వాక్రా మహిళలకు పాడి పశువులు పట్టుకోవడానికి వడ్డీ లేని రుణాలు ఇస్తారని తెలిపారు. కార్యక్ర మంలో సీసీ చిరంజీవి, లోకనాథం, సంఘమిత్ర మురగయ్య, మంజుల, బాలయ్య, వీఓ లీడర్లు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న దాతలు

విజయపురం: మండలంలోని మహావీరపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రిటైర్డ్ హెచ్‌ఎం చంద్రయ్య, రిటైర్డ్ ఉపాధ్యాయుడు దొరస్వామి నోటు బుక్స్, పెన్సిళ్లు, పెన్నులు తదితర విద్యా సామగ్రి అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుప్రసాద్ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ దాతలు అందించే విద్యా సామగ్రిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను గుర్తించి, వారికి అవసరమైన నోటు పుస్తకాలతోపాటు వివిధ రకాల పరికరాలు ఉచితంగా అందించడం చాలా ఆనందంగా ఉందని ఉపాధ్యాయిని ఉషారాణి అన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

నగరి: కేంద్ర సహకార బ్యాంకులో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గురువారం సహకార బ్యాంకులో రైతులకు కళాజాత ద్వారా పాటల రూపంలో బ్యాంకులో ఇచ్చే రుణాల వివరాలు, డ్వాక్రా మహిళలు పొదుపు ఎలా చేసుకోవాలి అనే అంశాలను వివరించారు. తాడేపల్లి గూడెం వి.సత్యకృష్ణ వీధి నాటక కళా బృందం వారు నిర్వహించిన ఈ కళాజాత అందరినీ ఆకర్షించింది. వివిధ వాణిజ్య బ్యాంకుల కన్నా 0.75 శాతం వడ్డీ ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఖాతాదారులకు ఇస్తున్నట్లు బ్యాంకు ఐటీ విభాగం అధికారి రమేష్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి సూపర్‌వైజర్ ఆనంద్, ఎఫ్ఎల్‌సీ కోఆర్డినేటర్ ప్రకాష్, నగరి పీఏసీఎస్ సీఈవో తులసిపిళ్లై, బ్యాంకు సిబ్బంది, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

వేప ఉత్పత్తులు భూమికి వరం

- వేప ఉత్పత్తుల వినియోగంపై అన్నదాతల దృష్టి
- రసాయన ఎరువుల వినియోగంతో భూసారం శూన్యం
- వేపతో తక్కువ ఖర్చు... అధిక దిగుబడులు
- దాదాపు 300 రకాల కీటకాలు నాశనం



పంటలో తెగుళ్ల నివారణతోపాటు అన్ని రకాల వ్యాధులకు వినియోగించే వేప

కార్వేటినగరం: వేపలో అజాడిరాక్టిన్ అనుకూల పదార్థం ఉంటుంది. దీనికి 300 రకాల కీటకాలు, నల్లజాతి పురుగులు, చెదలు, భూమిలోని కొన్ని రకాల బూజు శిలీంద్రాలను అరికట్టే శక్తి ఉంటుంది. వరి, పత్తి, అపరాలు, కూరగాయలు, పండ్ల మొక్కలు, కాఫీ, జొన్న ఉద్యాన పంటలను ఆశించే కీటకాలను వేప అరికడుతుంది. మార్కెట్లో వేపపిండి, వేపనూనె, వేప కషాయం ఇలా వివిధ రకాల వేప ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి.

కీటకాల నివారణలో కీలకం

నీమ్ ఆయిల్ స్థానిక వ్యవసాయ నిపుణుల సూచన మేరకు వినియోగిస్తే కీటకాలను నివారించవచ్చు. ఈ మందు పిచికారీ చేసినప్పుడు పురుగులకు



చీడ పీడల నివారణకు ఉపయోగపడే వేపకాయలు

వికారం కలిగించి పైరును నాశనం చేయకుండా చేస్తుంది. విషపూరిత అవశేషాలు ఉండవు. ఇది పక్షులు, మానవులు, మిత్రపురుగులు, తేనెటీగలు వంటి జీవరాశులకు హాని చేయదు. సమగ్ర సస్యరక్షణ విధానంలో వేప మందులు బాగా ఉపయుక్తమవుతాయి. పురుగు మందులు, శిలీంద్ర నాశినులతో వేపను కలిపి సురక్షితంగా పిచికారీ చేసుకోవచ్చు

పిచికారీకి సానుకూల సమయం

పైరుపై పురుగు ఆశించిన వెంటనే వేప నూనె పిచికారీ చేయాలి. తల్లి పురుగు గుడ్లు పెట్టినట్లు గమనించిన వెంటనే చేస్తే ఇంకా మంచిది. 3 నుంచి 5 మిల్లీలీటర్ల నీమ్ ఆయిల్‌ను లీటరు నీటితో కలిపి ఎకరాకు 20 లీటర్లు పిచికారీ చేయాలి. వాతావరణం చల్లగా ఉన్న సమయాల్లో(ఉదయం లేక సాయంత్రం) 7 నుంచి 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి. పిచికారీ చేసిన తర్వాత 6 గంటల వ్యవధిలో వర్షం పడితే మళ్లీ పిచికారీ చేయాల్సిందే.

తెగుళ్ల నివారణ

వివిధ పంటల్లో వేప మందుల వాడకంతో పలు రకాల చీడపీడలను నివారించవచ్చు. వరి పంటకు ఎకరాకు 150 నుంచి 200 కిలోల వేపపిండిని దమ్ములో వేయడం ద్వారా కాండం తొలిచే పురుగు, ఉల్లికోడును అదుపు చేయవచ్చు. వరి పైరుపై లీటరు నీటికి 3 మిల్లీ లీటర్ల చొప్పున కలిపిన ద్రావణాన్ని ఎకరాకు 200 లీటర్ల పిచికారీ చేస్తే అగ్గితెగులు, తొడిమికుళ్లు, పాడతెగులు, వరి తుంగ్రో వైరస్ తెగుళ్లను అదుపు చేసుకోవచ్చు. 5 శాతం వేప గింజల కషాయం ఎకరాకు 200 లీటర్ల ద్రావణాన్ని మిరప పంటపై పిచికారీ చేస్తే తెల్లదోమను అరికట్టవచ్చు. తద్వారా మిరప మీద వచ్చే జెమినీ వైరస్ అదుపులో ఉంటుంది. వేరుశనగను ఆశించి ఎక్కువగా నష్టపరిచే తిక్కాకు మచ్చ తెగులు, టమాటా సాగులో ఎండు తెగులును వేప నూనెతో నివారించవచ్చు.

ఇంట్లోనే వేప కషాయం తయారీ

పంటకు అవసరమైన వేప కషాయాన్ని ఇంట్లోని మహిళలే తయారు చేసుకోవచ్చు. 5 కిలోల వేప గింజలు నలగగొట్టి 6 నుంచి 7 లీటర్ల నీటిలో రెండు, మూడు రోజులు నానబెట్టాలి. దీన్ని వస్త్రంలో పోసి వడకట్టాలి. మరో 100 లీటర్ల నీటిని అందులో కలిపి వినియోగించాలి.

వేపతో మంచి ఫలితాలు



వేప గింజల నుంచి నూనె తీస్తారు. నూనె తీయగా వచ్చే వేపచెక్క ఎండిన వేపకాయలను దంచగా వేపపిండి తయారవుతుంది. ఈ పిండిని ఎక్కువగా వరి పంట, నిమ్మ తోటలకు వాడవచ్చు. ఎటువంటి పంటలైనా వేప ఉత్పత్తులను వాడి రైతులు దిగుబడిలో మంచి ఫలితాలు పొందవచ్చు. – **ఆర్.హేమలత, మండల వ్యవసాయ అధికారి, కార్వేటినగరం**

వేడుకగా ద్రౌపది అమ్మవారి ఊరేగింపు



ప్రత్యేక అలంకరణలో ద్రౌపదీ అమ్మవారు

కార్వేటినగరం: మహాభారత వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం ద్రౌపదీ అమ్మవారు ప్రత్యేక వాహనంపై కొలువుదీరి గ్రామ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఈ సందర్భంగా వేకువ జామున సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొలిపి అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం ఉభయదారులైన కరిణీకులు సమర్పించి పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక వాహనంపై ప్రతిష్టించి మంగళ వాయిద్యాల నడుమ, బాణాసంచా పేలుస్తూ అంగరంగ వైభవంగా ఊరేగించారు. ఈ క్రమంలో భాగంగా భాగవతారిణి రెడ్డెమ్మ హరికథను కనులకు కట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు పోకల సోమనాథ్, కమిటీ సభ్యులు హరిబాబు, బాబురెడ్డి, శివప్రకాష్, క్రిష్ణ యాదవ్, ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు అర్జున తపస్సు

వార్షిక మహా భారత ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్జున తపస్సు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు పోకల సోమనాథ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ కార్వేటినగరంలో వెలసి ఉన్న శ్రీద్రౌపదీ ధర్మరాజుల స్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం ఉదయం 8 గంటలకు నంది విగ్రహంతో గ్రామ వీధుల్లో ఊరేగిస్తామని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు అర్జున తపస్సు కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు.

స్పర్శ లేని మచ్చలను గుర్తించాలి



విద్యార్థుల స్పర్శలను పరిశీలిస్తున్న డాక్టర్

పాలసముద్రం: కౌమార దశలో బాల, బాలికలకు స్పర్శ లేని మచ్చలపై అవగాహన కల్పించాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి మోహన్ కృష్ణ తెలిపారు. గురువారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో తమ సిబ్బందికి సూపర్‌వైజర్ మురళి, సుశీల సమీక్షంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌కృష్ణ మాట్లాడుతూ ప్రతి శుక్ర, శనివారం బాలికలకు, బాలురకు రక్తహీనత నివారణకు ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు మింగిస్తున్నారని తెలిపారు. శారీరక మార్పులతో వచ్చే సందేహాలను నివృత్తి చేసి తప్పులు చేయకుండా వారికి మార్గనిర్దేశం చేస్తున్నామన్నారు. అనంతరం పాలసముద్రం ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు స్పర్శలో తేడాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం గంగా గౌరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

నగరి: గ్రామ పంచాయతీల్లో పనిచేసే గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలు ఇప్పించాలని గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేంద్రన్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద జీతాలు చెల్లించాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలు ఇవ్వాలని కోరుతూ జిల్లా అధికార యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదన్నారు. నూతన కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లిన సమయంలో జీతాలు వేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అయితే సంబంధిత అధికారులు ఇప్పటివరకు ఒక నెల జీతం కూడా వేయలేదన్నారు. జీతాలు రాక కార్మికులు కుటుంబాలను పోషించుకోలేక, పిల్లలను ఎలా చదివించుకోలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా వెంటనే అధికారులు స్పందించి జీతాలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా తీసుకొచ్చిన 680 జీఓ ప్రకారం రూ.10 వేలు చొప్పున జీతాలు చెల్లించాలని ఎంపీడీఓకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగరి సీనియర్ నాయకుడు వేలన్, పట్టణ నాయకుడు బాషా, గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేంద్రన్, గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు దేశప్ప, సెల్వం, జ్ఞానమణి, కుమారి, కార్మికులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతోనే అధిక దిగుబడి



సేంద్రియ ఎరువులతో సాగు చేసిన పంటను పరిశీలిస్తున్న వాసు

పాలసముదం: ప్రకృతి సేద్యంలో రైతులు సేంద్రియ ఎరువులు వాడడంతోనే అధిక దిగుబడులు సాధించవచ్చునని డీపీఎం వాసు తెలిపారు. గురువారం క్రిష్ణజమ్మపురంలో రైతులు ప్రకృతి వ్యవసాయంలో సేంద్రియ ఎరువులతో సాగు చేసిన పంటలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులతో డీపీఎం వాసు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసిన వరి నుంచి వచ్చిన బియ్యం ఉపయోగించుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కిచెన్ గార్డెన్, సూర్య మండలం మోడల్ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ పుష్ప, రైతులు షణ్ముగరెడ్డి, ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అర్థమయ్యే విధంగా విద్యాబోధన ఉండాలి



మాట్లాడుతున్న డీవైఈఓ ప్రభాకర్‌రాజు

పుత్తూరు: తరగతి గదుల్లో విద్యార్థులకు విద్యాబోధన అర్థమయ్యే విధంగా ఉండాలని, ఇందు కోసం నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని పుత్తూరు డీవైఈఓ ప్రభాకర్‌రాజు సూచించారు. గురువారం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో క్లాస్ రూమ్ అబ్జర్వేషన్ టీచ్ టూల్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 రోజులపాటు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు ఎంతో ప్రాముఖ్యత కలిగినవిగా పేర్కొన్నారు. మాస్టర్లుగా రమేష్, బాలసుబ్రమణ్యం, హిమగిరి, వేణుగోపాల్ వ్యవహరిస్తున్న క్లాసులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పుత్తూరు, నాగలాపురం, నారాయణవనం, పిచ్చాటూరు, సత్యవేడు, వడమాలపేట మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్లు పంపిణీ



కుట్టుమిషన్లు అందిస్తున్న అతిథులు

నగరి: ఓంశక్తి ఆలయంలో 38వ వార్షికోత్సవం, 32వ గురుపాదోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పేదలకు కుట్టుమిషన్లు, ఇడ్లీ పాత్రలు, చీరలు పంపిణీ చేశారు. తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, పశుసంవర్ధక శాఖ ఏడీ వాసు, మున్సిపల్ డీఈ నరేష్ ముఖ్యఅతిథులుగా పాల్గొని జీవనోపాధి లేని కుటుంబాలకు ఆసరాగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అభిషేక అర్చనలు, 1008 పుష్పార్చన, పంచముఖ దీపారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆదిపరాశక్తి ఆధ్యాత్మిక ప్రచార కమిటీ అధ్యక్షుడు టి.గంగాధర్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కేశవరెడ్డి మెమోరియల్ ట్రస్టు సేవలు భేష్



విద్యార్థులకు స్టడీ మెటీరీయల్ పంపిణీ

గంగాధరనెల్లూరు: కేశవరెడ్డి మెమోరియల్ ట్రస్టు సేవలు అభినందనీయమని మండల విద్యాశాఖ అధికారి ఆంజనేయులుశెట్టి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు కేశవరెడ్డి మెమోరియల్ ట్రస్టు అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్ వీసీ సుబ్రమణ్యం యాదవ్ చేతుల మీదుగా స్టడీ మెటిరీయల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు, దాతలు అందించిన స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం ట్రస్టు అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకోసం తమ సంస్థ పలు సేవా కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ మండల చైర్మన్ పాపిరెడ్డి, పాఠశాల హెచ్‌ఎం హేమలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ

పాలసముద్రం: ప్రభుత్వ పాఠశాలల్లో చవుతున్న విద్యార్థుల్లో వెనుకబడిన పిల్లలపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎంఈఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. గురువారం నరసింహాపురం, అయ్యావారికండ్రిగ ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల శాతం పెరగాలంటే ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని తెలిపారు. కొన్ని పాఠ్యాంశాల్లో నుంచి పిల్లలను ప్రశ్నలు అడిగారు. వారు సక్రమంగా సమాధానం చెప్పడంతో సంతృప్తి చెందారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి రుచి చూశారు.

నేటి నుంచి మహాభారత ఉత్సవాలు

వెదురుకుప్పం: పచ్చికాపల్లంలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో శుక్రవారం నుంచి మహాభారత ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 19 నుంచి 28వ తేదీ వరకు 10 రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఈ మేరకు గ్రామాల్లో ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం ధ్వజారోహణంతో ప్రారంభమై ప్రతి రోజూ మధ్యాహ్నం భాగవతారిణి భారతి హరికథా కాలక్షేపం, రాత్రి శ్రీ వెంకటేశ్వర కళా నాట్యమండలి ఆధ్వర్యంలో వీధి నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. 20న శనివారం పాండవ జననం, 21న ఆదివారం బండి కుంభాలు, 22న సోమవారం కలశ పూజ, ద్రౌపదీ దేవి కల్యాణం, 23న మంగళవారం ద్రౌపదీ మాన సంరక్షణ, 24న బుధవారం అర్జున తపస్మాన్, 25న గురువారం కీచక వధ, 26న శుక్రవారం ఉత్తరగోగ్రహణం, 27న శనివారం ఇలావంతుని వధ, 28న ఆదివారం దుర్యోధన వధ, పట్టాభిషేకం, అగ్ని గుండ ప్రవేశం కార్యక్రమాలు ఉంటాయన్నారు.

హెల్మెట్‌తో సురక్షిత ప్రయాణం





నగరి: ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయమూర్తి ఎస్.విష్ణువర్మ, పుత్తూరులో హెల్మెట్ వినియోగంపై ర్యాలీ

నగరి: హెల్మెట్ ధరించి వాహనాలు నడిపి సురక్షితంగా ప్రయాణించాలని జూనియర్ సివిల్ జడ్జి ఎస్.విష్ణువర్మ అన్నారు. గురువారం హెల్మెట్ ధరించడంతో కలిగే లాభాలను తెలియజేస్తూ లాయర్లు, పోలీసులతో కలిసి ఆయన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జరిమానా నుంచి తప్పించుకోవడానికో, పోలీసుల కోసమో కాదని, భద్రత కోసం హెల్మెట్ ధరించాలంటూ వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ లేని ప్రయాణం వలన సంవత్సరానికి వందల మంది మృత్యువాత పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ సురేష్, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ రక్షణ కవచం

పుత్తూరు: అతివేగం అనర్థాలకు మూలమని, అయితే దీన్ని నియత్రించడానికి హెల్మెట్ రక్షణ కవచంగా నిలుస్తుందని ఎస్ఐ వెంకటకృష్ణ పేర్కొన్నారు. గురువారం స్థానిక న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలో హెల్మెట్ వినియోగంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని స్పష్టం చేశారు. మోటార్ సైకిల్ వినియోగదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, తద్వారా రోడ్డు మరణాలను నియంత్రించవచ్చునన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

చేతిపంపు మరమ్మతు



చేతిపంపును మరమ్మతు చేస్తున్న సిబ్బంది

విజయపురం: మండలంలోని గొల్లకండ్రిగ గ్రామాల్లో మరమ్మతులకు గురైన చేతిపంపును శుక్రవారం అధికారులు సరిచేశారు. మోటార్‌ను సరిచేసి, పాత పైపులను తొలగించి నూతన పైపును అమర్చారు. దీంతో తాగునీటి సమస్య తీరిందని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

గ్రామాల్లో పైపులైన్లకు మరమ్మతులు





శ్రీరామపురంలో ట్యాంక్ వద్ద లీకేజీకి మరమ్మతులు, కొప్పేడు గ్రామంలో తాగునీటి పైపులకు మరమ్మతులు

నింద్ర: మండంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో తాగునీరు లీకేజీ ఉన్న పైపులైన్లకు గురువారం మరమ్మతులు చేపట్టారు. పారిశుధ్య పనులు కూడా నిర్వహించారు. వర్షాలు పడుతుండడంతో గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు ఆదేశించడంతో స్పందించిన సర్పంచ్‌లు మరమ్మతులు చేపడుతున్నారు. నింద్ర పంచాయతీ దళితవాడలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు తొలగించడంతోపాటు, తాగునీరు లీకేజీ లేకుండా చేశారు. కొప్పేడు గ్రామంలో తాగునీరు పైపులకు మరమ్మతులు చేశారు. శ్రీరామాపురంలో ట్యాంక్ వద్ద లీకేజీ బాగు చేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పాలసముద్రం: ప్రస్తుతం మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ రామనాథరెడ్డి తెలిపారు. గురువారం తమ సిబ్బందితో కలసి ఎస్ఆర్ఆర్ కండ్రిగ లేవుట్‌ని ఆయన సందర్శించారు. ఎస్ఆర్ఆర్ కండ్రిగ లేఅవుట్‌లో వీధిలైట్లు సమస్య ఉందని ప్రజలు విన్నవించారు. రెండు రోజుల్లో వీధిలైట్లు సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు తెలిపారు. గ్రామస్తులతో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అడపదడపా కురుస్తున్న వర్షాలకు ఇంటి పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ దాము, ఇంజినీర్ అసిస్టెంట్ జయరాజ్, పంచాయతీ కార్యదర్శి సుధ, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

విజయపురం: హాస్టల్ పరిసరాలు, వంటగది పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని డాక్టర్ విష్ణుప్రియ అన్నారు. గురువారం ఆమె జంబాడ ప్రభుత్వ బీసీ హాస్టల్‌ను తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలు, వంట గది, విద్యార్థులు పడుకొనే గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రధానంగా కూరగాయలు, వంట సామగ్రి శుభ్రతను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పిల్లలందరికీ నాణ్యమైన భోజనం అందించాలని, మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు బ్లీచింగ్ చేయాలని సూచించారు. ఫ్లోరినేషన్ చేసిన నీటినే పిల్లలకు అందించాలన్నారు. పిల్లలకు ఎదైన ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే స్థానిక ఆశవర్కర్, ఏఎన్ఎంకు తెలియజేయాలన్నారు. వాతావరణంలో వచ్చే మార్పులు కారణంగా జ్వరం, డయేరియా రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి చిన్నచిన్న రుగ్మతలకు మందులు ఇచ్చారు. ఆమె వెంట వైద్య సిబ్బంది ఉన్నారు.





పాలసముద్రం: ఎస్ఆర్ఆర్ కండ్రిగ లేఅవుట్‌లో ఎంపీడీఓ రామనాథరెడ్డి, విజయపురం: జంబాడ బీసీ హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న డాక్టర్ విష్ణుప్రియ